ఈనాడు
ఎన్ఆర్ఐ

# యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు కృష్ణమూర్తికి సన్మానం




డల్లాస్: అమెరికా కాంగ్రెస్ సభ్యునిగా ఎన్నికైన తర్వాత డల్లాస్‌కు వచ్చిన రాజా కృష్ణమూర్తికి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం పలికారు. రాజా గెలుపు కోసం పాల్ పాండియన్, డాక్టర్ ప్రసాద్ తోటకూర, ఎంఎల్ ప్రసాద్, సీసీ థియోఫిన్, శ్రీధర్ తుమ్మల కమిటీగా ఏర్పడి ఆయన విజయం కోసం విరాళాలు సేకరించారు. యూఎస్ కాంగ్రెస్‌కు ఎన్నికైన తర్వాత డల్లాస్‌కు రాజాను ఆహ్వానించి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా కృష్ణమూర్తిని నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర సభకు పరిచయం చేశారు. ప్రవాస భారతీయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో రాజా ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. యూఎస్ కాంగ్రెస్ సభ్యుడిగా ఉంటూ విద్య, ఉద్యోగుల కమిటీ, పర్యవేక్షణ, ప్రభుత్వ సంస్కరణల కమిటీల్లో కీలక సభ్యుడిగా ఉన్నారని చెప్పారు. 'ఒబామా కేర్' యాక్ట్ రద్దుకు ఉపక్రమించడం, ఏడు ముస్లిం దేశాలకు చెందిన పౌరులను అమెరికాలోకి నిషేధం విధించడం వంటి ట్రంప్ తీసుకున్న నిర్ణయాలను రాజా తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ముమ్ముందు అమెరికా రాజకీయాల్లో కృష్ణమూర్తి తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదగాలని ఆశిస్తున్నట్లు ప్రసాద్ తోటకూర చెప్పారు.




భారతీయ అమెరికన్లు చాలా ఓర్పు కలవారని యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి అన్నారు. తమ హక్కుల కోసం ఐక్యమత్యంతో గళాన్ని వినిపించాలని, లేకపోతే వెనుకపడిపోతామన్నారు. ప్రవాస భారతీయులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని, రాజకీయ రంగంలోనూ ఇదే ఒరవడిని కొనసాగించాలని అన్నారు. ఆసక్తి కలిగిన యువకులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. ఈ సందర్భంగా తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రాజా కృష్ణమూర్తికి డాలస్ ఆహ్వాన సంఘం సభ్యులు ఎంవీఎల్ ప్రసాద్, డాక్టర్ ప్రసాద్ తోటకూర, సిసి థియోఫిన్ శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా డాలస్‌కు విచ్చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

